సాక్షి

యాదాద్రి భువనగిరి

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు

ప్రభుత్వ పథకాలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకే అందుతున్నాయని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. - 9లో



శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

బీఆర్ఎస్ అభ్యర్థులు, నాయకులు సోమవారం ఉదయం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీగా గడిపారు. - 9లో



మహిళల ఉసురు తగులుతుంది

ప్రభుత్వంమద్యాన్ని ఏరులై పారిస్తుందని, మహిళల ఉసురు తగులుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

గుట్ట మున్సిపల్ కమిషనర్‌గా అజయ్‌కుమార్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న అజయ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్‌గా అజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్‌అండ్‌బీ విభాగంలో పని చేస్తున్న ఆయన బదిలీపై యాదగిరిగుట్టకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ జోగులాంబ గద్వాల్ జిల్లాలోని ఆయిజ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అజయ్‌కుమార్‌రెడ్డి గతంలో 11 నెలలు యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

మూడు రోజులు భగీరథ నీళ్లు బంద్

చౌటుప్పల్ : నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటం వద్ద ఉన్న కృష్ణాజలాల నీటి శుద్ధి కేంద్రం మరమ్మతుల కారణంగా ఈనెల 12నుండి 14వ తేదీ వరకు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ చౌటుప్పల్ గ్రిడ్ డివిజన్ ఈఈ ధనుంజయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌటుప్పల్ మండలంలో 53, సంస్థాన్‌నారాయణపురం 65, భూదాన్‌పోచంపల్లి 19, వలిగొండ మండలంలో నాలుగు గ్రామాకలు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు.

యాదాద్రి శివాలయంలో సంప్రదాయ పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. శ్రీపర్వత వర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన గావించారు. పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగాయి. నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు తదితర కైంకర్యాలు నిర్వహించారు.

డీఎంహెచ్‌ఓగా బాధ్యతల స్వీకరణ

భువనగిరి : డాక్టర్ పరిపూర్ణాచారి సోమవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎంహెచ్‌ఓగా పనిచేసిన మల్లికార్జున్‌రావు హైదరాబాద్‌కు బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా ఉన్న పరిపూర్ణాచారి నియమితులయ్యారు.

ఎయిమ్స్‌లో పారా మెడికల్ కోర్సులు



పారా మెడికల్ విద్యార్థులో వికాస్ భాటియా

బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం కొత్తగా పారా మెడికల్ కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ.. వైద్యకళాశాలకు అనుబంధంగా పారామెడికల్ కోర్సులు కూడా ప్రారంభించడం ద్వారా నూతన శకానికి నాంది పలికామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎయిమ్స్ ఎంతో కృషి చేస్తుందని, అందులో భాగంగా కీలకపాత్ర పోషించే పారామెడికల్ కేడర్‌ను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ నోడల్ అధికారి అభిషేక్, పారామెడికల్ కోర్సు వైద్యులు ఫారాగ్, ఫాటి తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

భువనగిరిటౌన్ : ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు వ్యయప్రయాసలకోర్చి వస్తుంటారని, వారి అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వివిధ సమస్యలపై 14 అర్జీలు రాగా సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేశారు. కాగా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో గంట ముందుగానే ప్రజావాణి కార్యక్రమాన్ని ముగించారు.

సమరానికి సైరన్

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో వేడెక్కిన రాజకీయం

- సోమవారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి ఎన్నికల కోడ్
- ఉదయమంతా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యేలు
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి దూకుడు పెంచిన బీఆర్ఎస్
- అభ్యర్థుల ఎంపిక కసరత్తులో కాంగ్రెస్, బీజేపీ
- ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు





ఉమ్మడి జిల్లాలో మొత్తం నియోజకవర్గాలు	పోలింగ్ స్టేషన్లు
12	3,533

ప్రస్తుతం మొత్తం ఓటర్లు 28,29,357

సాక్షిప్రతినిధి నల్లగొండ : ఎన్నికల సమరం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. షెడ్యూల్ విడుదల కావడంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల నియమావళి) అమల్లోకి వచ్చింది. ఇక నుంచి పార్టీలు, అభ్యర్థులంతా ఎన్నికల నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలుకు జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లతో సిద్ధమైంది.

రంగంలోకి దిగిన యంత్రాంగం

వచ్చే నెల 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 10వ తేదీన నామినేషన్లు ముగియనున్నాయి. 13వ తేదీన నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణకు అవకాశం ఇచ్చింది. నవంబర్ 30 తేదీన పోలింగ్ జరుగనుండగా, డిసెంబరు 3వ తేదీన కౌటింగ్ జరుగనుంది. కౌంటింగ్ ముగిసే వరకు అమల్లో ఉండే కోడ్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగింది. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కేంద్రాలతో పాటు అన్ని ప్రాంతాల్లో గోడలపై ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధిన వాల్ రైటింగ్స్, ఇతర రాతలను తుడిచి వేయడం ప్రారంభించారు. ఫ్లెక్సీలను తొలగించడంతోపాటు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగు వేస్తున్నారు.

- ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా నాలుగు రకాల పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు చొప్పున మహిళా పోలింగ్ స్టేషన్లు, ఐదు చొప్పున మోడల్ పోలింగ్ స్టేషన్లు, దివ్యాంగుల కోసం ఒక్కో పోలింగ్ కేంద్రం, ఒక్కో యూత్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

రెండేళ్ల సీడీపీ నిధులతో పనులు మంజూరు

ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో ఒక్కో ఎమ్మెల్యేకు ఏటా రూ.3 కోట్ల నియోజక వర్గ అభివృద్ధి నిధులు (సీడీపీ) మంజూరయ్యాయి. ప్రస్తుతం వాటికి సంబంధించిన ప్రతిపాదనలను అందజేశారు. సోమవారం ఉదయం 11 గంటల వరకు కూడా ఈ ప్రక్రియ కొనసాగింది. నల్ల గొండ జిల్లాలో మూడేళ్లకు సంబంధించి ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలకు రూ.79.50 కోట్లు (శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డికి తక్కువ వచ్చింది) విడుదలయ్యాయి. వారిలో కొందరు గత నెల వరకు కూడా ఎలాంటి పనులనూ చేపట్టలేదు. ఎన్నికల కోడ్ వస్తుందని తెలియడంతో జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పనులను మంజూరు చేసి ప్రతిపాదనలను అందజేశారు.

బెల్టు దుకాణాలు బంద్

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలగకుండా చేపట్టిన చర్యల్లో భాగంగా జిల్లాలో బెల్టు దుకాణాలను మూసివేయించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు అందాయి. అలాగే అక్రమ మద్యం రవాణా జరుగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నారు.



భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార వాహనాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ దూకుడు

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. అన్ని ప్రధాన పార్టీలు తమ అస్త్రాలను సిద్ధం చేసుకునే పనిలో పడ్డాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి దూకుడు పెంచగా.. కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థుల ఎంపిక కసరత్తులో ఉన్నాయి. ఎన్నికల షెడ్యూలు వస్తుందని ముందస్తు అంచనాతో అధికార పార్టీ 15 రోజుల కిందటి నుంచే స్పీడ్ పెంచి కార్యక్రమాలను కొనసాగించింది. నియోజక వర్గాల్లో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవాలు చేయగా, మంజూరైన పనులకు శంకుస్థాపన చేశారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపే దళిత బంధు, బీసీ బందు, గృహలక్ష్మి , మైనార్టీ బంధు వంటి పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఎన్నికల షెడ్యూలు విడుదలకు మరో రెండు రోజులు పట్టవచ్చని భావించినా, సోమవారం షెడ్యూల్ వస్తుందని తెలియడంతో ఆగమేఘాలపై పనులను మంజూరు చేశారు. కోడ్ వస్తే ఇబ్బంది అవుతుందని ముందుగానే అధికారులు కూడా పెండింగ్ పనులను క్లియర్ చేసే పనుల్లో మధ్యాహ్నం వరకు బిజీగా గడిపారు.

రిటర్నింగ్ అధికారులు వీరే..

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి
నల్లగొండ	ఎస్.రవి (ఆర్డీఓ, నల్లగొండ)
దేవరకొండ	జి.శ్రీనివాసులు (ఆర్డీఓ, దేవరకొండ)
నాగార్జునసాగర్	జె. శ్రీనివాస్ (రెవెన్యూ అదనపు కలెక్టర్, నల్లగొండ)
మిర్యాలగూడ	చెన్నయ్య (ఆర్డీఓ, మిర్యాలగూడ)
మునుగోడు	దామోదర్‌రావు (ఆర్డీఓ, చండూరు)
నకిరేకల్	హేమంత్‌కేశవ్ పాటిల్ (స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నల్లగొండ)
భువనగిరి	అమరేందర్ (ఆర్డీఓ, భువనగిరి)
ఆలేరు	వీరారెడ్డి (స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదాద్రి)
హుజూర్‌నగర్	జగదీశ్వర్‌రెడ్డి (ఆర్డీఓ, హుజూర్‌నగర్)
కోదాడ	సూర్యనారాయణ (ఆర్డీఓ, కోదాడ)
సూర్యాపేట	వీరబ్రహ్మచారి (ఆర్డీఓ, సూర్యాపేట)
తుంగతుర్తి	వెంకట్‌రెడ్డి (రెవెన్యూ అదనపు కలెక్టర్, సూర్యాపేట)

నియోజకవర్గాల వారీగా ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
దేవరకొండ	1,22,161	1,19,291	15	2,41,467	308
నాగార్జునసాగర్	1,12,613	1,15,947	20	2,28,580	299
మిర్యాగూడ	1,11,169	1,14,434	23	2,25,626	263
నల్లగొండ	1,16,487	1,21,326	53	2,37,866	284
మునుగోడు	1,24,473	1,23,996	5	2,48,474	307
నకిరేకల్	1,22,021	1,22,442	4	2,44,467	305
భువనగిరి	1,05,404	1,05,958	--	2,11,362	257
ఆలేరు	1,14,388	1,13,332	18	2,27,738	309
హుజూర్‌నగర్	1,18,664	1,24,030	17	2,42,711	308
కోదాడ	1,16,257	1,21,017	15	2,37,289	296
సూర్యాపేట	1,15,638	1,19,576	17	2,35,221	271
తుంగతుర్తి	1,24,836	1,23,722	08	2,48,556	326



కలెక్టరేట్ సమీపంలో రాజకీయ పార్టీల వాల్ పేయింటింగ్, పోస్టర్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

'నియమావళి'అమలు

- అప్రమత్తమైన యంత్రాంగం
- క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం
- పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

సాక్షి, యాదాద్రి : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం నుంచే ఫ్లయింగ్ స్క్వాడ్, ఇతర టీంలను క్షేత్రస్థాయికి పంపించారు. ఎన్నికల నియమావళి, ఎన్నికల నిర్వహణ, విధి విధానాలు, పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పనపై సెక్టార్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. అభ్యర్థుల వాహనాలు, ప్రచార కార్యక్రమాలపై నిఘా పెంచారు. సివిజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను మానిటరింగ్ చేయడంపై అవగాహన కల్పించారు.

కొత్తవాటికి మంజూరు ఉండదు

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కొత్తగా మంజూరు ఉండదు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలలోపు మంజూరైన పథకాల అమలు యథావిధిగా అమలుకానున్నాయి.

ప్రత్యేక టీంలు

ఎన్నికల కోడ్ కట్టుదిట్టంగా అమలు చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు స్టాటిస్టికల్, సర్వైవల్ టీంలను ఏర్పాటు చేశారు. అలాగే పోలీసులు, ఇతర అధికారులు కూడా నిత్యం పర్యవేక్షించనున్నారు. ఆలాగే నియోజకవర్గానికి 3 చొప్పున చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల ఉల్లంఘన కింద 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 53 కేసులు నమోదయ్యాయి. అక్రమంగా తరలిస్తున్న రూ.53.29 లక్షలు పట్టుకున్నారు. 236 మందిని బైండోవర్ చేశారు. 17 ఆయుధాలను సరెండర్ చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 39 కేసులు నమోదయ్యాయి. రూ.12.50 లక్షలు పట్టుకున్నారు.

అధికారుల ఆధీనంలో ప్రభుత్వ భవనాలు

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ రహదారి బంగ్లాలను అధికారులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల్లో రాజకీయ కార్యకలాపాలు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేశారు. 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, 38 గంటల్లో రోడ్ల వెంట, గోడలపైన రాతలు, ప్రచార పోస్టర్లను తొలగించాలి. ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులపై ఎలాంటి రాజకీయ ప్రచార కార్యక్రమాలు లేకుండా 72 గంటల్లోగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం .. ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘించినా, ఏదైనా సమస్య ఉన్నా ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబర్1950ను అందుబాటులో ఉంచారు. దీంతో పాటు సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించనున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

కట్టుదిట్టంగా అమలు చేయాలి

సాక్షి, యాదాద్రి : ఎన్నికల కోడ్ కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సెక్టార్ ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ రోజున మాక్ పోలింగ్ నిర్వహించాలని, అన్ని పార్టీల పోలింగ్ ఏజెంట్లు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని, అందుకోసం కోడ్ ఆఫ కండక్ట్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్‌రావు, అడిషనల్ డీసీపీ రవికుమార్, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, శివరామిరెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పరిశీలన

కలెక్టరేట్, గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను సోమవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు.




కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం

16న భువనగిరిలో కేసీఆర్ సభ

సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 16వ తేదీన భువనగిరికి రానున్నారు. ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 15, 16, 17,18 తేదీల్లో కేసీఆర్ జిల్లాల పర్యటనకు సంబంధించిన వివరాలను పార్టీ అధిష్టానం ప్రకటించింది. 2018 ఎన్నికల్లో భువనగిరి ఎన్నికల సభకు కేసీఆర్ తుది విడత ప్రచారానికి వచ్చారు.

మూడింటిలో పీటముడి!

- సాగర్‌లో జానా తనయుడివైపే మొగ్గు
- ఆ రెండు స్థానాలు కమ్యూనిస్టులకేనా?



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో మూడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ల వ్యవహారం తేలలేదు. మిగతా నియోజకవర్గాల్లో దాదాపు కొలిక్కి వచ్చినా దేవరకొండ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఆశావహులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు నాగార్జునసాగర్‌లో మాజీ మంత్రి జానారెడ్డినే పోటీలో దింపాలని భావించినా ఆయన తన కుమారుడికే టికెట్ ఇప్పించుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇదిలా ఉంటే పొత్తులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టులకు రెండు స్థానాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ అంగీకారానికి వచ్చిందంటూ ప్రచారం సాగుతోంది. మిర్యాలగూడ సీపీఎంకు, మునుగోడు స్థానాన్ని సీపీఐకి ఇస్తున్నారన్న విషయంపై సోమవారం రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయా స్థానాలను ఆశిస్తున్న వారు తీవ్ర ఆందోళనలో పడ్డారు. మిర్యాలగూడలో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న బత్తుల లక్ష్మారెడ్డి వర్గం, మునుగోడులో టికెట్ ఆశిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి వర్గం నిరాశలో పడింది. అయితే, మిర్యాలగూడ, మునుగోడు స్థానాలను ఇచ్చేందుకు ఒప్పందం కుదిరిందని కమ్యూనిస్టు పార్టీల నేతలు చెబుతుండగా.. ఆ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ వర్గాలు కొట్టి పారేస్తున్నాయి.

తేలాల్సి ఉన్న మూడు స్థానాలు

మూడు స్థానాల్లో ఎవరిని బరిలో నిలుపాలన్న విషయంలో కాంగ్రెస్ ఇంకా నిర్ణయానికి రానట్లుగా తెలిసింది. ముఖ్యంగా దేవరకొండ, తుంగతుర్తి స్థానాల్లో తీవ్ర పోటీ నెలకొనగా, సూర్యాపేటలో ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. దేవరకొండలో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ కోసం ఐదారుగురు ప్రయత్నిస్తున్నారు. అందులో మాజీ ఎమ్మెల్యే బాలునాయక్‌తోపాటు గతంలో టీడీపీ, పీఆర్‌పీలో పనిచేసిన వడ్త్యా రమేష్‌నాయక్, కిషన్‌నాయక్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో రమేష్‌నాయక్ మాజీ మంత్రి జానారెడ్డి ద్వారా తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గతంలో పీఆర్‌పీలో పనిచేసినందున సినీ నటుడు చిరంజీవి ద్వారా కూడా రమేష్ నాయక్ ప్రయత్నాలు చేస్తుండటంతో టికెట్ ఎవరికి ఇవ్వాలన్న విషయాన్ని తేల్చలేదు. ఇక, తుంగతుర్తిలో అద్దంకి దయాకర్, పిడమర్తి రవి, నాగరిగారి ప్రీతమ్, భాషపంగు భాస్కర్, వడ్డేపల్లి రవి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మోత్కుపల్లి నర్సింహులు కూడా టికెట్ ఆశిస్తున్నారు. అక్కడ పోటీ అధికంగా ఉండటంతో వెంటనే తేల్చని పరిస్థితి నెలకొంది. ఇక సూర్యాపేటలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్ మధ్య సయోధ్య కుదిర్చే పనిలోనే అధిష్టానం ఉంది. దీంతో వారిలో ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఓ నిర్ణయానికి రాలేదు. నాగార్జునసాగర్‌లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తన కుమారుడు జైవీర్‌రెడ్డి అవకాశం ఇవ్వాలని పట్టుపడుతున్నారు. అవసరమైతే తాను ఎంపీ వెళతానని ప్రకటించారు. దీంతో అక్కడ జానారెడ్డి కూమారునికే టికెట్ ఇవ్వాలని భావిస్తున్నారు.

ఖిలాపై ఎగిరేది కాషాయ జెండానే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు

సాక్షి,యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి ఖిలాపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం భువనగిరిలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర పార్టీ ఇచ్చిన వివిధ కార్యక్రమాలపై వివరించారు. ఈ సదర్బంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గడగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీ వందల కోట్ల రూపాయలు మంజూరు చేశారని, రాష్ట్రం వాటిని దారి మళ్లించి సొంతానికి వాడుకుంటుందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ గిమ్మిక్కులను ప్రజలే నమ్మేస్థితిలో లేరని, నియంతృత్వ సర్కార్‌ను గద్దె దించడమే బీజేపీ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీఎస్ రవీందర్, కర్నాటి ధనుంజయ, పాశం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల నర్సింగ్ రావు, సీఎస్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చిక్కా కృష్ణ, ఉపాధ్యక్షులు చందా మహేందర్ గుప్తా, పిట్టల అశోక్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బీజేవైఎం అధ్యక్షుడు ఏలూరి శ్యామ్, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవీ శ్యాంసుందర్‌రావు

మండలంగా 'మత్స్యాద్రి వేములకొండ అరూర్'



వేములకొండ మండల సాధనకు నిరాహార దీక్ష చేస్తున్న అఖిలపక్ష నాయకులు (ఫైల్)

- 10 గ్రామాలతో ఏర్పాటుకు నిర్ణయం
- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఫలించిన వేములకొండ, అరూర్ ప్రజల పోరాటం

వలిగొండ : మండలంలోని వేములకొండ, అరూర్ గ్రామాల ప్రజలు పోరాటం ఫలించింది. ఆయా గ్రామాలు కేంద్రంగా నూతన మండలాలను ఏర్పాటు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో 2022 జూలై నుంచి నిరసన దీక్షలు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి వేములకొండ, అరూర్ గ్రామ పంచాయతీలను కలుపుతూ మత్స్యాద్రి వేములకొండ అరూర్ పేరుతో నూతన మండల ఏర్పాటుకు సోమవారం గెజిట్ విడుదల చేసింది.

నూతన మండలంలోకి వచ్చే గ్రామాలు ఇవే..

10 గ్రామాలతో మత్స్యాద్రి వేములకొండ అరూర్ మండలాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో వేములకొండ, అరూర్, దుప్పల్లి, గంగాపూర్, వెంకటాపూర్, ముద్దాపూర్, చిత్తాపూర్, గోపరాజ్‌పల్లి, గురునాథ్‌పల్లి, నర్సాపురం గ్రామాలు ఉన్నాయి.

పట్టు వీడకుండా దీక్షలు

వలిగొండ మండల పరిధిలో ఉన్న వేములకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని ఆ గ్రామ అఖిలపక్ష నాయకులు 2022 జూలై 24 దీక్ష ప్రారంభించారు. దీక్షలు చేపట్టి సుమారు 445 రోజులైంది. అలాగే అరూర్ మండలకోసం గ్రామ అఖిలపక్ష నేతలు 2022 జూలై 26నుంచి దీక్ష చేపట్టారు. 200 రోజుల పాటు దీక్షలు కొనసాగించారు.

సంబరాలు : నూతన మండల ఏర్పాటుకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో వేములకొండ, అరూర్ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అరూర్‌లో ర్యాలీ తీశారు. టపాలసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

మత్స్యాద్రి వేములకొండ అరూర్ మండల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం డ్రాఫ్ట్ వచ్చింది. 10 గ్రామాల ప్రజలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో 15రోజుల్లో తమ అభ్యంతరాలు తెలియజేయాలి.

-వినయ్‌కృష్ణారెడ్డి, కలెక్టర్



భువనగిరిలో మహిళా ఓటర్లకు గ్యారంటీ స్కీంల పత్రాలను అందజేస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ప్రచారం షురూ..

భువనగిరి రూరల్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రాగా.. నాయకులు ప్రచారం మొదలుపెట్టారు. సోమవారం భువనగిరి పట్టణంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంల గురించి ఓటర్లకు వివరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.



ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్), పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ బీసన్న, విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడేవారిపై పోలీసు నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఎలక్షన్ సమయంలో వచ్చే వదంతులను ప్రజలు నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ బీపీ బఘేల్, ఏడుగురు ఎస్ఐలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, 60మంది సిబ్బంది పాల్గొన్నారు.



నాగార్జునసాగర్‌లోని పైలాన్‌కాలనీలో కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులు

ఎక్కడికక్కడ వాహనాల తనిఖీ



యాదగిరిగుట్ట పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రమేష్



ఆలేరురూరల్: బైపాస్ రోడ్డులో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట: రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో యాదగిరిగుట్ట పట్టణంలోని కొత్త గుండ్లపల్లి వద్ద పట్టణ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల్లో డబ్బులు, మద్యం తరలించకుండా నిఘా పెట్టినట్లు సీఐ తెలిపారు.

ఆలేరు బైపాస్ రోడ్డులో..

ఆలేరురూరల్: ఆలేరు బైపాస్ రోడ్డులో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. బైపాస్ రోడ్డులో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ సోమవారం వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో యాదాద్రి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి టి. వినయ్‌కృష్ణారెడ్డి, భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ. భాస్కరరావు, ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులను అధికారులు నిర్వహించాలని వికాస్‌రాజ్ అధికారులకు సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న యాదాద్రి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, అధికారులు

సరిహద్దుల్లో గట్టి నిఘా

- సూర్యాపేట జిల్లాలో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు
- అక్రమంగా డబ్బు, మద్యం రవాణా నిరోధానికి చర్యలు
- రెండుమూడు రోజుల్లో రానున్న పారా మిలిటరీ బలగాలు



కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డులోని చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సూర్యాపేట : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అక్రమంగా డబ్బు, మద్యం రవాణా జరగకుండా అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్‌పోస్టులో 14 మంది వివిధ శాఖల సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఆయా చెక్‌పోస్టులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.

సరిహద్దుల్లో ఏడు అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు..

జిల్లాలోని చిమిర్యాల, మట్టపల్లి, మహంకాళిగూడెం, పులిచింతల ప్రాజెక్ట్, బుగ్గమాదారం, దొండపాడు, రామాపురం ఎక్స్ రోడ్డు వద్ద అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్‌పోస్ట్‌లో పోలీస్ సిబ్బంది ఐదుగురు, రెవెన్యూ సిబ్బంది ఇద్దరు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఇద్దరు, ఎక్సైజ్ శాఖ నుంచి ఇద్దరు , జీఎస్‌టీ ఒకరు, ఒక ఫొటోగ్రాఫర్, ఒక వీడియోగ్రాఫర్‌తో కలిపి మొత్తం 14 మంది విధులు నిర్వహించనున్నారు. వీరు షిఫ్టుల పద్ధతిలో డ్యూటీ చేయనున్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టులు కూడా..

సూర్యాపేట జిల్లాలోని టేకుమట్ల, మద్దిరాల, తిరుమలగిరి, మోతె మండలాల సరిహద్దు ప్రాంతాల్లో అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గానికి మూడు చొప్పున ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, మండలానికి ఒక ఎంసీసీ టీమ్స్ విధులు నిర్వహించనున్నాయి.

2,500 పోలీసు సిబ్బంది, 76 సెక్షన్ల పారా మిలిటరీ బలగాలతో..

ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట, హుజూర్‌నగర్, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 2,500 మంది పోలీస్ సిబ్బంది, 76 సెక్షన్ల పారా మిలిటరీ బలగాలతో బందోబస్తు చేపడుతున్నారు.రెండుమూడు రోజుల్లో 76 సెక్షన్ల పారా మిలిటరీ బలగాలు చేరుకోనున్నాయి.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఉక్కుపాదం మోపుతాం..

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఉక్కుపాదం మోపుతాం. పటిష్ట పోలీస్ భద్రత నడుమ ఎన్నికలు నిర్వహిస్తాం. అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ఈ చెక్‌పోస్టుల్లో 24 గంటలు ఎన్నికలు పూర్తయ్యే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారు. సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా ఉంచాం. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే, తప్పుడు ప్రచారం చేస్తే సంబంధిత వ్యక్తులు, వాట్సప్ అడ్మిన్ లపై చట్టపరమైన చర్యలు తప్పవు. గత ఎన్నికల్లో కేసుల్లో ఉన్న నేరస్తులు, సమస్యలు సృష్టించే ట్రబుల్ మాంగర్స్, రౌడీలు, కేడీలు, సస్పెక్ట్‌లను ముందస్తు బైండోవర్ చేస్తాం. జిల్లాలో ఉన్న ఆయుధాలను ముందస్తుగా స్వాధీనం చేసుకుంటాం. సమస్యాత్మక (క్రిటికల్) గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచుతాం. నిషేధిత వస్తువులు, మద్యం, నాటు సారా, డబ్బు, ధ్రువపత్రాలు లేని విలువైన ఆభరణాలు, వస్తువులు అక్రమంగా రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహిస్తాం.

– ఎస్. రాజేంద్రప్రసాద్, ఎస్పీ, సూర్యాపేట

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

- నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ: రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ అపూర్వరావుతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్, ఓటరు జాబితా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ స్టేషన్ల గురించి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థికి గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు ఖర్చు చేసే పరిమితి ఉందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో 24 గంటల్లోగా, రైల్వే స్టేషన్‌లలో 48 గంటల్లోగా, ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన గోడలపై ప్రచార రాతలు, పోస్టర్‌లు వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయ నియంత్రణకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సంబంధిత ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల నాయకులు మల్లికార్జున్, శంకర్‌నాయక్, అశోక్, ఎండీ రజియుద్దీన్, పి. లింగస్వామి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్స్ తొలగింపు

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో యాదగిరిగుట్ట, నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ఆయా మున్సిపాలిటీ అధికారులు సోమవారం తొలగించారు. వాల్ రైటింగ్స్‌ను సున్నంతో తుడిచివేయించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నల్లగొండ, భువనగిరి



యాదగిరిగుట్టలో వాల్ రైటింగ్స్‌పై సున్నం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది



నల్లగొండ కలెక్టరేట్‌లో ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహానికి ముసుగు కప్పుతున్న సిబ్బంది



నల్లగొండ పట్టణంలో వాల్ రైటింగ్స్‌పై సున్నం వేస్తున్న సిబ్బంది



భువనగిరి కలెక్టరేట్ వద్ద వాల్ రైటింగ్స్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

చెక్‌పోస్టుల వద్ద నగదు పట్టివేత

కోదాడరూరల్: అంతర్రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు సోమవారం వాహనాల తనిఖీల్లో రూ.2.50లక్షల నగదును పట్టుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కిరాణా దుకాణాల నుంచి నాగరాజు అనే వ్యక్తి కలెక్షన్ నగదును తీసుకొస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన నగదును రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు. పట్టుబడిన నగదుకు సంబంధించిన ఆధారాలు చూపిస్తే వెనక్కి ఇచ్చేస్తామన్నారు.

మట్టపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.4.30లక్షలు సీజ్..

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద సోమవారం చేపట్టిన తనిఖీల్లో రెండు వాహనాలలో తరలిస్తున్న రూ.4.30లక్షలను సీజ్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని పిడుగురాళ్లకు చెందిన శ్రీనివాస్ తన కారులో రూ1.80లక్షలు తీసుకొని కోదాడకు వెళ్తున్నాడని, ఆ డబ్బుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటకు చెందిన షేక్ కరీముల్లా హుజూర్‌నగర్ నుంచి తన కారులో రూ.2.50లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం రూ.4.30లక్షలు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

15 నుంచి నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో పాల్గొనే భక్త దంపతులు రూ.1,116 టిక్కెట్ కొనుగోలు చేయాలని వెల్లడించారు. ఒక్కరోజు సప్తశతి పారాయణంలో పాల్గొనే భక్తులు రూ.116, లక్ష కుంకుమార్చనకు రూ.116 చెల్లించాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు శివాలయంలో జరిపించే శ్రీరుద్ర హోమం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఆందోళనల మధ్య డబుల్ బెడ్‌రూం ఇళ్ల డ్రా

- తక్కెళ్లపహాడ్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో రగడ
- అనర్హులకు ఇళ్లు కేటాయిస్తున్నారని పలువురి ఆరోపణ
- పోలీసులకు, గ్రామస్తులకు మధ్య తోపులాట



తక్కెళ్లపహాడ్ లో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు

శాలిగౌరారం: మండలంలోని తక్కెళ్లపహాడ్‌లో సోమవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి సంబంధించి డ్రా తీస్తుండగా గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్రాలో అర్హులైన పేదల పేర్లను చదివి వినిపించాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. అధికారులు మాత్రం అర్హుల పేర్లను చదవకుండానే డ్రా తీసేందుకు ఏర్పాట్లు చేయడంతో ప్రజలు వారితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా శాలిగౌరారం సీఐ రాఘవరావు, శాలిగౌరారం, కేతేపల్లి, కట్టంగూర్, తిప్పర్తి ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది ప్రజలను నిలువరించేందుకు ప్రయత్నించగా.. వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పోలీసులకు, ప్రజలకు మధ్య తోపులాట జరిగింది. మరో పక్క రెవెన్యూ అధికారులు 55 మంది అర్హులను గుర్తించి వారిలో 28 మందికి ఇళ్లను కేటాయించేందుకు డ్రా తీశారు. స్థానిక రాజకీయ నాయకులు తయారుచేసిన అనర్హుల జాబితాలోని వారికే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించారని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సాయంత్రం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పోలీసులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనకారులను వెళ్లగొట్టారు.

33 ప్లాట్లలో 28 ఇళ్ల నిర్మాణం..

తక్కెళ్లపహాడ్ గ్రామంలో 2003లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్లు 8, 10లో 5.20 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సుమారు 100 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. అందులో 67 మంది లబ్ధిదారులు వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. మరో 33 మంది తమ ఇళ్ల స్థలాలను ఖాళీగా ఉంచుకున్నారు. ఈ క్రమంలో 2016లో తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం స్థల సేకరణ జరపగా... గ్రామంలో ఖాళీగా ఉన్న 33 ప్లాట్లను డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించారు. అందులో 28 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు.

నిబంధనల మేరకే డ్రా తీశాం

తక్కెళ్లపహాడ్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలకు లోబడే డ్రా తీశాం. గ్రామంలో బీపీఎల్ పరిధిలోకి వచ్చే ఇద్దరు వికలాంగులతో పాటు అర్హులైన 55 మందిని గుర్తించాం. వీరిలో ప్రజల సమక్షంలో బహిరంగంగా జరిగిన డ్రా పద్ధతిలో 28 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాం.

– పాల్‌సింగ్, తహసీల్దార్, శాలిగౌరారం

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

మఠంపల్లి: మండల కేంద్రంలోని వీవీ హైస్కూల్ వీధిలో మండవ నరసింహారావు ఇంట్లో ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. కరెంట్ సరఫరా జరిగే వైరులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఫ్రిజ్, కూలర్, దుస్తులు, ఫ్యాన్లు, టీవీ తదితర వస్తువులు కాలిపోయాయని బాధితుడు పేర్కొన్నాడు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



దగ్ధమైన గృహోపకరణాలు

బైక్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

శాలిగౌరారం: బైక్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలంలోని 365వ నంబర్ జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల్లో బిక్షాటన చేస్తూ జీవిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం రాత్రి మాధారంకలాన్ గ్రామపంచాయతీ పరిధిలోని చౌళ్లగూడెం వైపు నుంచి పెర్కకొండారం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తిని స్థానికులు 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712670178 నంబర్‌కు సమాచారమివ్వాలని ఎస్ఐ సూచించారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక యువకుడి ఆత్మహత్య

మాడుగులపల్లి: తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక గడ్డి మందు తాగి యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన అనుముల చందు(25) తండ్రి రవీంద్రచారి అనారోగ్యంతో నెలరోజుల క్రితం మృతిచెందాడు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేని చందు నాటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 7న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి మాడుగులపల్లి మండలం కొత్తగూడెం శివారులో గడ్డి మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడు నెలల కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



శ్రీదేవి (ఫైల్)

నేరేడుచర్ల: ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీలో నివాసముంటున్న ధీరావత్ వీర్యానాయక్, శ్రీదేవి(33) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు కార్తీక్, సాత్విక్ ఉన్నారు. వీర్యానాయక్ పెంచికల్‌దిన్న గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీదేవి చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీర్యానాయక్ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి తలుపులు ఎంత కొట్టినా శ్రీదేవి తీయకపోవడంతో స్థానికుల సహకారంతో తలుపులు పగులకొట్టగా ఆమె ఉరికి వేలాడుతూ కనిపించింది. ఆమెను కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. శ్రీదేవి రాసిన సూసైట్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తి పంపకాలే కారణమా..?

శ్రీదేవి తల్లిదండ్రులు బిక్య హరిలాల్, కమ్మలమ్మ పెన్‌పహాడ్ మండలం గుడిబండతండాలో ఉంటున్నారు. శ్రీదేవి చెల్లెలు సునీత సూర్యాపేటలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. కాగా అక్కాచెల్లెళ్ల మధ్య కొంతకాలంగా ఆస్తి పంపకాలకు సంబంధించి గొడవలు జరుగుతున్నాయని, ఈ విషయంలో తన తల్లిదండ్రులు సైతం తన చెల్లెలు సునీతకే సపోర్ట్ చేస్తుండడంతో శ్రీదేవి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి భర్త వీర్యానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి..

రామగిరి(నల్లగొండ): కుటుంబ కలహాలతో రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన తిప్పర్తి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన ఇనుడపాక ఎల్లమ్మ(52), ఆమె భర్త వెంకటరాములు కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కుటుంబ కలహాలతో ఎల్లమ్మ ఆదివారం రాత్రి తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అక్కడ దొరికిన ఎల్ల మ్మ ఫోన్ సహాయంతో ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే ఎస్సై సాలకమ్మ తెలిపారు.

బతుకమ్మ చీరల దహనం

బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని పిల్లిగుండ్ల తండాలో సోమవారం పలువురు మహిళలు బతుకమ్మ చీరలను దహనం చేశారు. బతుకమ్మ చీరలు నాసిరకంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండాకు ప్రభుత్వం కేటాయించిన 254 చీరలలో కొందరు మహిళలు చీరలు తీసుకొని గ్రామ పంచాయతీ ఆవరణలో నిప్పు పెట్టారు. దీంతో అధికారులు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మధ్యలోనే నిలిపివేశారు.



పిల్లిగుండ్ల తండాలో బతుకమ్మ చీరలను దహనం చేస్తున్న మహిళలు

ట్రాక్టర్ ట్రాలీలు చోరీ

మద్దిరాల: మండలంలోని పోలుమల్లలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్ ట్రాలీలు చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలుమల్ల గ్రామానికి చెందిన ఏలేటి రాంరెడ్డి, ఎల్లు జగన్ ఈ నెల 2వ తేదీన తమ వ్యవసాయ భూముల వద్ద తమ ట్రాక్టర్ల ట్రాలీలను ఉంచారు. 3వ తేదీ తెల్ల వారుజామున వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి చూడగా ట్రాలీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు సోమవారం మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.